

గత పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు, దమనకాండలు నడిపిన జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు ప్రజాస్వామ్యంపై ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. జంగిల్ రాజ్ అన్న మాటలు హాస్యాస్పదం. ప్రజలు ఆయన పాలనలోనే అరాచకాన్ని అనుభవించారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

గురువారం 05.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 289 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# "స్వయం" పేరుతో డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్



## జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను ఆకట్టుకునేలా బ్రాండింగ్

### సెర్ప్, మెప్మాపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం "స్వయం" అనే పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్షించారు. బ్రాండింగ్ కల్పించే ప్రక్రియలో భాగంగా అధికారులు ప్రతిపాదించిన వివిధ పేర్లు.. లోగోలను సీఎం పరిశీలించారు. అధికారులు ప్రతిపాదించిన రెండు లోగోలను పరిశీలించిన సీఎం... లోగో ఖరారుపై డ్వాక్రా సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. మెజార్టీ అభిప్రాయం మేరకు లోగో ఖరారుపై నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "డ్వాక్రా మహిళలు అద్భుతమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వారికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్థానికంగా ఉండే మార్కెట్లే కాకుండా.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా.. మహిళా ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే అదే స్థాయిలో మిగతా 2లో...




రేపు ప్రధాని మోదీ "పరీక్షా పే చర్చా" కార్యక్రమం

# తప్పక వీక్షించండి



- రాష్ట్ర ప్రజలకు ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ పిలుపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే ప్రతిష్ఠాత్మక కార్యక్రమం "పరీక్షా పే చర్చా" రేపు శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం కానుందని, దీన్ని తప్పకుండా వీక్షించాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పరీక్షా పే చర్చా" కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో నేరుగా సంభాషిస్తూ, పరీక్షల భయాన్ని తొలగించే దిశగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఒత్తిడి లేకుండా పరీక్షలను ఎదుర్కొనే మార్గాలను సూచించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ ఏడాది "పరీక్షా పే చర్చా" కార్యక్రమాన్ని దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారని మాధవ్ తెలిపారు. గుజరాత్‌లోని దేవ్ మోగ్రా, తమిళనాడులోని కోయంబత్తూరు, ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్, అస్సాంలోని గువాహటి నగరాల్లో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందన్నారు.

"యువ మిత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడటం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చదువుతో పాటు మానసిక సమతుల్యత, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం. ఇవి ఉంటేనే పరీక్షలను విజయవంతంగా ఎదుర్కోగలుగుతాం" అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా సుమారు 4.5 కోట్ల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఇది ఈ కార్యక్రమానికి ఉన్న ఆదరణకు నిదర్శనమని చెప్పారు. రేపు ప్రసారం కానున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తప్పక వీక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు

- సాస్కి నిధులతో బీసీ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ఆదరణ -3 ద్వారా ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- బీసీ సంక్షేమశాఖ పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా, ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆదరణ 3 పథకం ద్వారా కులవృత్తుల వారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం బీసీ సంక్షేమశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణంతో పాటు అక్కడ సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

రూ. 60 కోట్ల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల



2లో

# వాట్సప్ గవర్నెన్స్ 'మనమిత్ర'కు విశేష ఆదరణ

- అరకోటికి పెరిగిన యూజర్లు
- 2.50 కోట్లకుపైగా సేవలు (లావాదేవీలు) అందుకున్న యూజర్లు
- వాట్సప్ గవర్నెన్స్ కు గణనీయంగా పెరుగుతున్న ఆదరణ
- ఉన్న చోటు నుంచే క్షణాల్లో పనులు పూర్తి
- బిల్లుల చెల్లింపుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాల డౌన్‌లోడు వరకు
- అన్నీ మొబైల్ ఫోనులోనే పూర్తి చేసుకునే సదుపాయం
- రాష్ట్రం బయట ఉన్న ఏపీ వారూ ఉపయోగించుకుంటున్న తీరు
- ప్రతి ఇంటి చిరునామాగా మారిన మనమిత్ర నెంబరు 9552300009

2లో




## దివ్యాంగ బ్యాక్ ల్యాగ్ పోస్టులు మార్చిలోపు భర్తీ చేయాలి



- దివ్యాంగ పాఠశాలల్లో అడ్మిషన్లపై విస్తృత ప్రచారం కల్పించాలి, అడ్మిషన్లు 100 శాతం పూర్తి కావాలి
- దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ మోటార్ సైకిళ్ల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి
- మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి
- వెలగపూడి సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి డా. స్వామి సమీక్ష సమావేశం

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగ బ్యాక్ ల్యాగ్ పోస్టులు ఈ ఏడాది మార్చిలోపు భర్తీ చేయాలని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. బుధవారం నాడు వెలగపూడి సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు UDID కార్డులు, త్రీవీలర్ మోటార్ బైక్ ల పంపిణీ, దివ్యాంగ పాఠశాలల్లో అడ్మిషన్లు, వయోవృద్ధులకు వయో వందన ఆయుష్మాన్ భారత్ కార్డులు, మిగతా 2లో...

## సాగునీటి సంఘాలతో భారీ సమావేశం నేడు



- అమరావతిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల అధ్యక్షులతో భారీ సమావేశం నేడు అమరావతిలో నిర్వహించనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు. మిగతా 2లో...

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు "ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు"



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారం వరించింది. వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ వ్యాపార ప్రతిపాదన సంస్థ యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ మంత్రి విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటించింది. యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ వాషింగ్టన్ డీసీలో ప్రధాన కార్యాలయం కలిగిన మిగతా 2లో...

## పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్ష



- పర్యాటక రంగ బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం రూ. 150 కోట్ల ప్రతిపాదన
- విశాఖ, తిరుపతిలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.. అన్ని జిల్లాల్లో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమని మంత్రి దుర్గేష్ వెల్లడి

మిగతా 2లో...

## బడ్జెట్ కూర్పుపై సమీక్ష



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు హోం శాఖకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. పోలీస్ శాఖ మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం, సిబ్బంది అవసరాలు తదితర అంశాలపై అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ సెక్రటరీలు వినయ్ కుమార్, రోనాల్డ్ రాస్, జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడ, హోమ్ శాఖ సెక్రటరీ విజయ్ కుమార్, అడిషనల్ డీజీ మధుసూదన్, ఐజీ రవిప్రకాష్తో పాటు పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు.

# వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించండి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై రాష్ట్ర వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతన్నలకు బలమైన అండగా నిలిచేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి, అలాగే రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించే దిశగా వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖలకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వృద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశుసంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వ్యవసాయ, అనుబంధ శాఖల పరిధిలో ముఖ్యమైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతుల నిర్మాణం, కొనసాగుతున్న మరియు ప్రతిపాదిత ప్రాజెక్టుల అమలుకు అదనపు నిధులు అవసరమని వివరించారు. మిగతా 2లో...



## “స్వయం” పేరుతో డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్



(మొదటి పేజీ తరువాయి)

బ్రాండింగ్ ఆకర్షణీయంగా ఉండాలి. బ్రాండ్ పేరు, లోగో ఆకట్టుకునేలా ఉండాలి. బ్రాండ్ పేరు, లోగోతోనే కాన్సెప్ట్ అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఉత్పత్తులను తెస్తున్నారు కాబట్టి... స్వయం అనే పేరు బాగుంటుంది. అదే తరహాలో లోగో డిజైన్ కూడా ఉండాలి.”అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు



(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో రూ. 17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో పాటు హాస్టళ్లలో శానిటేషన్ తో పాటు విద్యార్ధులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా బోధన సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచనలు ఇచ్చారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 6 మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చాలని సీఎం ఆదేశించారు. బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వారికి ప్రయోజనం కలిగేలా పథకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## దివ్యాంగ బ్యాక్ ల్యాగ్ పోస్టులు మార్చిలోపు భర్తీ చేయాలి



(మొదటి పేజీ తరువాయి)

సహాయ పరికరాల పంపిణీ, ట్రాన్స్ జెండర్స్ కి గుర్తింపు కార్డులు, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ...దివ్యాంగ పాఠశాలల్లో అడ్మిషన్లపై విస్తృత ప్రచారం కల్పించాలి, అడ్మిషన్లు 100 శాతం పూర్తి కావాలి. దివ్యాంగ పాఠశాలల్లో మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలి. విద్యార్థులకు మెనూ అమలులో రాజీపడొద్దు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించాలి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ ల్యాగ్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి మార్చిలోపు భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలి. దివ్యాంగులకు ఉచితంగా ఇచ్చే త్రీవీలర్ మోటార్ సైకిళ్ల పంపిణీకి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలి. వయో వృద్ధులకు సహాయ పరికరాలు ఎక్కువ మందికి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## సాగునీటి సంఘాలతో భారీ సమావేశం నేడు



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలన వల్ల రాష్ట్ర ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. రూ. 18 వేల కోట్లకు పైగా బిల్లుల బకాయిలను కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా ఇచ్చారని విమర్శించారు. ఇరిగేషన్ శాఖను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పోలవరం, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరు-నగరి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, ఉత్తరాంధ్ర ప్రధాన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

ఖరీఫ్ పంట ముగిసినా రాయలసీమలోనూ రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు నిల్వ ఉందంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్ధవంతమైన వాటర్ మేనేజ్‌మెంట్ ఫలితమని చెప్పారు. నాడు రాజుల కాలంలో చెరువులు నిండినట్లు, నేడు చంద్రబాబు పాలనలో రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా ఉన్నాయని అన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకుని భూమిని కూడా రిజర్వాయర్‌లా మార్చుకోవాలని, భూగర్భ జలాలను పెంచి కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటి భద్రత, వాటర్ మేనేజ్‌మెంట్, భూగర్భ జలాల పెంపుపై సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.


# వాట్సప్ గవర్నెన్స్ ‘మనమిత్ర’కు విశేష ఆదరణ

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏలూరుకు చెందిన ఎం. కిశోర్ బెంగళూరులో ఛార్టెర్డ్ అకౌంటెంటుగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన ఏలూరులోని తన సొంత ఆస్తికి సంబంధించి పన్నులు చెల్లించాలన్నా పనులు మానుకుని ఇక్కడికి రావాల్సి వచ్చేది. ఒకటి రెండు రోజులు ఇక్కడ ఉన్న కార్యాలయాల చుట్టూ తిరగడానికే పని సరిపోయేది. ఇప్పుడు ఆయనకు ఆ ఇబ్బంది లేదు. తన మొబైల్ ఫోనులోనే తాను చెల్లించాల్సిన పన్నులు పూర్తి చేసుకుంటున్నారు. మరిన్ని సేవలు పొందుతున్నారు.

పల్నాడు జిల్లా నాదేండ్లకు చెందిన సరళది ఇదే తరహా అనుభవం. ఆమె హైదరాబాద్‌లో పనిచేస్తోంది. గతంలో ఆమె పన్నులు కట్టాలన్నా, రెవెన్యూ సేవలు పొందాలన్నా పనులు మానేసుకుని హైదరాబాద్ నుంచి ఇంటికి రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఆమెకు ఆ అవసరం కనిపించడం లేదు. హైదరాబాద్ నుంచే తన మొబైల్ ఫోనులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా బిల్లలు చెల్లింపు మొదలు, దరఖాస్తు చేసుకోవడం వరకు అన్ని సేవలు పొందుతోంది. ఇటీవలే శ్రీశైలం మల్లన్న స్వామి దర్శనానికి టికెట్లు బుక్ చేసుకుంది.

అనకాపల్లి మండలం మామిడిపాలెంకు చెందిన సురేష్ ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నారు. ఉదయం ఆఫీసుకు వెళ్లి ఇంటికి రావాలంటే రాత్రి 8 గంటలవుతుంది. సర్టిఫికెట్ కావాలన్నా, పన్నులు చెల్లించాలన్నా ప్రత్యేకించి సెలవు పెట్టుకుని సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆయనకు ఇప్పుడా అవరం కనిపించడం లేదు. తన మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే తనకు కావాల్సిన ఓబీసీ సర్టిఫికెట్ కోసం హాయిగా దరఖాస్తు చేసుకున్నారు.

మనమిత్రతో హాయ్‌గా సేవలు పొందుతున్న లక్షలాది మంది పౌరుల్లో వీరు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వ కార్యాలయాలకు ఏమాత్రం వెళ్లాల్సిన పనిలేకుండా తామున్న చోటు నుంచే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పుడు ఏపీలో లక్షలాది మంది ప్రజలు




హాయిగా సేవులు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ఆనందంగా ఆస్వాధిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మనమిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ కు ప్రజల ఆదారణ పెరుగుతోంది. ప్రజలు ఇప్పుడిప్పుడే ఈ సదుపాయం ఉపయోగాలేంటో అర్థం చేసుకుంటున్నారు. వాట్సాప్ ఉపయోగించడానికి మొగ్గు చూపుతున్నారు. మనమిత్ర ఉపయోగించేవారి సంఖ్య ప్రస్తుతం అరకోటి దాటింది. రాష్ట్రంలో ప్రజలెవ్వరూ కూడా తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకే తీసుకెళ్లాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆశయం. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేస్తూ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమానికి రూపుకల్పన చేశారు. గత ఏడాది జనవరిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఏడాది కాలంలో వాట్సాప్ గవర్నెన్స్ యూజర్ల సంఖ్య రోజురోజుకీ గణణీయంగా పెరుగుతూ ప్రజాదరణ చూరగొంటోంది.

**వెయ్యికి పైగా సేవలు:** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు దాదాపు వెయ్యికి పైగా సేవలు కల్పించనుంది. ప్రస్తుతం 900కు పైగా సేవలు మనమిత్ర ద్వారా అందుతున్నాయి. ఈ నెలలో ఈ సేవలు వెయ్యికి దాటనున్నాయి. ఆర్టీసీ బస్సు టికెట్ల రిజర్వేషన్లు మొదలు, మున్సిపాల్టీ, పంచాయతీల్లో ఆస్తిపన్ను, నీటి పన్నుల చెల్లింపులు, కరెంటు బిల్లుల చెల్లింపులు, రెవెన్యూ, పోలీసు, పింఛన్లు, రిజిస్ట్రేషన్ సేవలు, తల్లికి వందనం, సర్టిఫికెట్లు, ఓబీసీ, ఇన్‌కమ్, ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు, ఫలితాలు కూడా ఇందులోనే డౌన్ లోడు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే సదుపాయం ఇలా పలు రకాల సేవలను మనమిత్ర ద్వారా పౌరులకు అందిస్తోంది.

**పట్టాదారు పాసుపుస్తకం పొందొచ్చు :** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రెవెన్యూ సేవలు మరింత సులభతరం చేశారు. ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ తమ సెల్‌ఫోన్ లోని వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. 1-బీ అడంగళ్ కాపీని ఇందులోనే డౌన్ లోడు చేసుకోవచ్చు. పట్టాదారుపాసుపుస్తకం ఈ-కాపీని కూడా ఇందులో డౌనులోడు చేసుకోవడంతో పాటు తమ ఆస్థులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. గతంలో ఈ పనుల కోసం ప్రజలు పనులు మానేసుకుని రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఈసీ (ఎన్‌క్యుంబరెన్సు సర్టిఫికెట్)కూడా ఇందులోంచి డౌను లోడు చేసుకోవచ్చు.

**ఆలయాల సేవలన్నీ :** తిరుమల శ్రీవారి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి చేసే ఆర్జిత సేవల టికెట్లు, దర్శనాల టికెట్ల బుకింగ్ మొదలు, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, సింహాచలం, అన్నవరం, తదితర ప్రముఖ ఆలయాలతో పాటు దేవాదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో సేవలకు సంబంధించి వాట్సాప్‌లో భక్తులు ముందుగానే నమోదు చేసుకోవచ్చు. అలాగే ఆయా ఆలయాలకు భక్తులు కానుకలను కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ-హుండీకి పంపొచ్చు.

**9552300009 సేవ్ చేసుకోండి :** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులందరూ సులభంగా సేవలు పొందడానికి వారి యాండ్రాయిడ్ మొబైల్ ఫోనులో 9552300009 నెంబరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. వాట్సాప్‌లో ఈ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపితే చాలు, అందులో ప్రభుత్వం పౌరులకు అందిస్తున్న సేవలన్నీ కనిపిస్తాయి. పౌరులు తమకు ఎలాంటి సేవలు కావాలో అందులో తెలుసుకుని చాలా సులభంగా ఇట్టే క్షణాల్లో ఆ సేవలను పొందవచ్చు.

**తెలుగులోనూ పనిచేస్తుంది :** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఇంగ్లీషు, తెలుగు భాషల్లోనూ పనిచేస్తుంది. అందువల్ల పౌరులు దీన్ని ఉపయోగించడం ఎంతో తేలిక. పైగా సేవలు కూడా ఎంతో సులభంగా పనిచేస్తాయి.

**వాయిస్ ద్వారా కూడా :** వాట్సాప్‌లో టైపు చేయడం తెలీని వారు తమకు ఏం కావాలో వాయిస్ ద్వారా చెప్పడం ద్వారా కూడా ఆ సేవలు పొందవచ్చు. ఆ విధంగా పనిచేసేలా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు) ఆధారితంగా పనిచేస్తుంది.

**50 లక్షలకు చేరిన యూజర్లు :** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను రాష్ట్రంలో వినియోగించేవారి సంఖ్య 50 లక్షలకు చేరుకుంది. వీరు పలుమార్లు ప్రభుత్వ సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందారు. ఈ ప్రకారం ఈ యూజర్ల అందుకున్న సేవలు, చేసిన లావాదేవీలు 2.50 కోట్లకుపైగా ఉన్నాయి. వీరంతా కూడా ఎలాంటి అంతరాయాలు లేకుండా క్షణాల్లో సేవలను వాట్సాప్ గవర్నెన్సప్ ద్వారా పొందారు.

## పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్ష



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, పర్యాటక రంగ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై వెలగపూడి సెక్రటేరియట్‌లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, శాఖాధిపతులు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు అవసరమైన నిధులపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడంతో పాటు వివిధ పర్యాటక ఉత్సవాల నిర్వహణకు రూ. 150 కోట్లు కేటాయించాలని మంత్రి దుర్గేష్ ఆర్థిక మంత్రిని కోరారు. విశాఖపట్నం, తిరుపతి నగరాలను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక తోడ్పాటు అందించాలని చర్చించారు. అదే విధంగా అన్ని జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు ఆర్థిక సహకారం కావాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రసాద్, స్వదేశీ దర్శన్ 2.0, సీబీడీడీ, శాస్కి మరియు ‘పూర్వోదయ’ పథకాల ద్వారా వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని, కనెక్టివిటీని మెరుగుపరచాలని నిర్ణయించామన్నారు. వివిధ వేదికలపై పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయించి అనంతరం త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా 2014-19 కాలానికి సంబంధించిన పాత బకాయిల చెల్లింపులపై కూడా సానుకూలంగా చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పర్యాటక ఉత్సవాల అంశం చర్చకు వచ్చింది.

ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెక్రటరీ రోనాల్డ్ రాస్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంతకుముందు పర్యాటక శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి దుర్గేష్.. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పీపీపీ విధానంలో సాగుతున్న ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన క్యాపిటల్ వర్క్స్, పార్కుల అభివృద్ధి మరియు పర్యాటకుల భద్రతపై అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ దిశానిర్దేశం చేశారు. తూర్పు భారతదేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు , పర్యాటకం, సంస్కృతిని ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన పర్యాటక ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పూర్వోదయ క్రింద పర్యాటక సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయడం, కనెక్టివిటీని మెరుగుపరచడం మరియు పర్యాటక సంబంధిత కార్యకలాపాల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలను పెంచడం, పర్యాటకాభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

# అంబటి హత్యకు టిడిపి పన్నాగం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు, దాడులు, హింసాత్మక ఘటనలపై కేంద్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. అంబటి హత్యకు టిడిపి పన్నాగం పన్నిందని, అందులో భాగంగానే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనపై దాడి చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై గత శనివారం గుంటూరులో టిడిపి నేతలు, కార్యకర్తల దాడి నేపథ్యంలో రాంబాబు కుటుంబాన్ని బుధవారం సాయంత్రం జగన్ పరామర్శించారు. రాంబాబు భార్య, ఇద్దరు కుమార్తెలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. టిడిపి కార్యకర్తల మూకదాడిలో దెబ్బతిన్న రాంబాబు నివాసాన్ని, కార్యాలయాన్ని, ఫర్నీచరు, ఇతర వస్తువులు, వాహనాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. దాడి తీవ్రతపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, జంగిల్‌రాజ్ పాలన నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలు, కార్యాలయాలపై దాడి ఘటనలను, మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యే బల్లా బ్రహ్మనాయుడిపై నమోదైన అక్రమ కేసులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంబటి రాంబాబు, విడదల రజని, జోగి రమేష్, భూమన కరుణాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బల్లా బ్రహ్మనాయుడు చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ గురించి గతేడాది కాలంగా సిఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు నియమించిన సిబిఐ సిట్ దాఖలు చేసిన



ఛార్జిషీటులో తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు లేదని స్పష్టంగా పేర్కొన్నా కావాలని తిరుమల లడ్డూకు ఉన్న పేరును చెడగొడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని రెండు కీలక ల్యాబ్‌లు ఇచ్చిన నివేదికలను సిట్ పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని తమ పార్టీ నాయకులు విమర్శిస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే అంబటి రాంబాబును, ఆయన కుటుంబాన్ని అంతర చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. తొలుత పోలీసుల సమక్షంలోనే కర్రలతో రాంబాబు కారును అడ్డగించారని, కారుపై బాదారని, బూతులు కూడా తిట్టారని, ఈ నేపథ్యంలో రాంబాబు ప్రతిస్పందించారని తెలిపారు. ఒక్కడి మీద అంతమంది దాడి చేస్తే రాంబాబు నోటి నుంచి కటువైన పదం వచ్చిందన్నారు. అయినా, చంద్రబాబును తిట్టినందుకు ఆయన క్షమాపణ చెప్పారని, చాలా సంస్కారంగా వివరణ ఇచ్చారని తెలిపారు. అయినా, ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావు ఆధ్వర్యంలో అంబటిని హత్య చేసేందుకు మూకదాడి చేశారని, అందులో భాగంగానే సాయంత్రం ఐదు గంటల నుంచి అర్ధరాత్రి వరకు విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. గళ్లా మాధవి భర్త రామచంద్రరావు... రాంబాబు ఆఫీసు పగలగొట్టారని, ఆయన మనుషులు ఇంటికి నిప్పు పెట్టారని జగన్ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలను మీడియాకు చూపారు. ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయన్నారు. ఇంట్లో మహిళలు ఉన్నా వెనక్కి తగ్గలేదన్నారు. కూతవేటు దూరంలో ఎస్‌పి, ఐజి, డిజిపి కార్యాలయాలు ఉన్నా ఎవ్వరూ స్పందించలేదని విమర్శించారు. రాత్రి 10.30 గంటలకు రాంబాబును పోలీసులు అరెస్టు చేసి ఇంటారాగేషన్ పేరుతో గుంటూరులో సిఐలు వంశీ, వెంకటేశ్వర్లు వేధించారని ఆరోపించారు. హత్యాయత్నం చేసిన వారిని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, వీరిలో ఎమ్మెల్యే దంపతులు కూడా ఉన్నారని తెలిపారు. జోగి రమేష్ ఇంటిపై పోలీసుల సమక్షంలోనే పెట్రోల్ బాంబులతో దాడి చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే తిరుమల లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. మరో మూడేళ్లలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఇప్పుడు తప్పుడు పనులు చేస్తున్న వారిని అప్పుడు వదిలిపెట్టబోమని జడన్ హెచ్చరించారు.

## వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల కోసం అదనపు బడ్జెట్ కేటాయింపులు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఈ విజ్ఞప్తిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందిస్తూ, రైతు సంక్షేమం, వ్యవసాయ, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. రాబోయే బడ్జెట్‌లో ఈ రంగాలకు తగిన నిధులు కేటాయించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు “ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు”



(మొదటి పేజీ తరువాయి)

ఒక లాభాపేక్షలేని సంస్థ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం ఈ కౌన్సిల్ కృషి చేస్తోంది. యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సీఈఓ & ప్రెసిడెంట్ ఎలీషా బి. పులివర్తి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు అమెరికా అధ్యక్షుని పేరుతో ఇచ్చే “ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు”ను అందజేశారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల బలోపేతం, మహిళా నేతృత్వంలోని పరిశ్రమలకు ప్రోత్సాహం, సెర్ప్ ద్వారా గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాల పెంపు, స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేయడం కోసం చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేశారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం :** రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం యూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలోని పెట్టుబడులను, సాంకేతికతను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి, ఎన్ఆర్ఐల భాగస్వామ్యాన్ని పెంచడానికి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలోయూ.ఎస్-ఇండియా ఎస్.ఎమ్.ఈ కౌన్సిల్ సిఈఓ/ప్రెసిడెంట్, ఎలీషా బి. పులివర్తి, వైస్ చైర్మన్ కె. శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎమ్.ఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్, ప్రధాన సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎమ్. శ్రీనివాస శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డి ఈ ఓ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష చేబ్రోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరు, ఎస్ ఎన్ గవర్నమెంట్ హై స్కూల్ చేబ్రోలు, ఎంపీపీ ఎస్ పాఠశాలలను బుధవారం చేబ్రోలు తనిఖీ చేశారు ఈ సందర్భంగా నారాకోడూరు పాఠశాలలో9వ తరగతి విద్యార్థులకు ఒక పాఠ్యాంశం బోధించి పిల్లల సామర్థ్యాలు, వారు రోజువారి కార్యక్రమాలు, ఈ విద్యా సంవత్సరంలో వారు రాసిన పరీక్షల వివరాలు , మార్కులను తెలుసుకున్నారు విద్యార్థులకు పలు ప్రశ్నలతో సమాధానం రాబట్టారు ఈ సందర్భంగా విద్యార్థులందరూ చాలా చక్కగా నోటు పుస్తకాలు , ఏకరూప దుస్తులు చక్కగా ఉండటం పట్ల వారిని అభినందించారు 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజు ప్రణాళిక తీరు , 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం అందిస్తున్న అల్పాహారం గూర్చి తెలుసుకొని పాఠశాలను సమర్థవంతముగా నిర్వహిస్తున్న పాఠశాలప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు ను అభినందించారు అనంతరం చేబ్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులసామర్థ్యాలు , ఆరు నుండి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థుల ప్రశ్న పత్రాలు తనిఖీ చేసి, అనంతరం పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మమధ్యాహ్నబడి భోజనాన్ని అమలు చేస్తున్న తీరును, రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజననాణ్యత విషయంలో ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు రాజీ పడవద్దని అదేవిధంగా భోజనం వడ్డించే ప్రాంతమంతా పరి శు భ్రంగాఉంచుకోవాలని అన్నారు అనంతరం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న 75 రోజుల జీఎఫ్ఎల్ఎన్ తీరును పరిశీలించి ప్రతి విద్యార్థి 100% జి ఎఫ్ ఎల్ ఎన్ సాధించాలని తెలిపారు.

# మణిపూర్ సీఎం ఖేంచంద్ సింగ్‌కు ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ శుభాకాంక్షలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):**మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా యుమ్నం ఖేంచంద్ సింగ్ ఎన్నిక కావడాన్ని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హర్షాతిరేకంతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన ఖేంచంద్ సింగ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో యుమ్నం ఖేమ్చంద్ సింగ్‌ను పార్టీ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం శుభపరిణామమని మాధవ్ పేర్కొన్నారు. ఇది మణిపూర్ రాజకీయాల్లో స్థిరత్వానికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు.

ఖేంచంద్ సింగ్ గతంలో మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా, అలాగే గత ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించిన అనుభవశాలి నాయకుడని మాధవ్ గుర్తు చేశారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడిగా ఆయనకు మంచి పేరు ఉందన్నారు.

ముఖ్యమంత్రిగా ఖేంచంద్ సింగ్ బాధ్యతలు స్వీకరించడం ద్వారా మణిపూర్ రాష్ట్రంలో అభివృద్ధి, శాంతి, స్థిరత్వం దిశగా కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వేగంగా ముందుకు సాగుతున్న సమయంలో, మణిపూర్ కూడా అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# రవిదాసు జయంతి వేడుకలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్రకమిటీ పిలుపుమేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గం 15వ మండలం అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో సంత్ గురు రవిదాసు 649వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

15వ మండలం 13వ వార్డు మెయిన్ రోడ్డులోని గోల్డ్ షాపుల ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో రవిదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చర్మ కార్మికుడు కోటేశ్వరరావును శాలువాతో సత్కరించి, నిత్యవసర సరుకులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధారా అంబేద్కర్ హాజరయ్యారు. బీజేపీ సీనియర్ నాయకుడు నేరెళ్ల మాధవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రామకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కత్తి మేరీ సరోజిని పాల్గొన్నారు.

అలాగే ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు తురక రామారావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సాంబశివరావు, యువ మోర్చా అధ్యక్షుడు యశ్వంత్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కారం శెట్టి రమేష్, రెండో మండల అధ్యక్షుడు నరేష్, 15వ మండల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు కొల్లిపర వెంకటేశ్వరరావు, కృష్ణ, వేముల సాయి, త్రినాథ్, వేమూరి ప్రసాద్, చెంచయ్య, ఎమార్పీఎస్ నగర అధ్యక్షుడు దావులూరి కుమార్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమల వ్యవహారంపై త్వరలో సిట్ పూర్తి నివేదిక



- దోషులపై కఠిన చర్యలు తప్పవు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):**తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన ఇటీవలి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తి స్థాయి నివేదిక త్వరలోనే సమర్పించనుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా విస్తృత విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఇప్పటికే ఈ కేసులో పలువురిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్న మాధవ్, దోషుల్ని మాత్రమే కాకుండా వారికి వెనుక నుంచి ప్రోత్సాహం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. తిరుమల వంటి పవిత్ర క్షేత్రాల ప్రతిష్ఠను భంగం కలిగించే ఏ చర్యను కూడా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన రక్షణ కవచాలు, నిబంధనలు రూపొందించడంపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారని ఆయన వెల్లడించారు.

తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల వ్యవహారాలు, పూజా విధానాలు ఆగమశాస్త్రం ప్రకారమే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడుతూ, దేవాలయాల పవిత్రతకు భంగం కలగకుండా ముందుకు సాగుతామని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# అక్షర ఆంధ్రా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో అక్షర ఆంధ్రా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అక్షర ఆంధ్రా క్రింద శిక్షణ పొందుతున్న వయోజనుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. రానున్న పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. పటిష్ట పర్యవేక్షణ ఉండాలని, కేంద్రంలో అభ్యసిస్తున్న ప్రతీ ఒక్కరూ చక్కని చదువు, రాయడం రావాలని ఆదేశించారు. అక్షర ఆంధ్రాలో గుంటూరు జిల్లా ఆదర్శంగా నిలవాలని అన్నారు. కేంద్రంలో 140 మంది శిక్షణ పొందుతున్నారని, మండలంలో 4100 మంది అక్షర ఆంధ్రా కార్యక్రమంలో ఉన్నారని అక్షర ఆంధ్రా పర్యవేక్షకులు దాసరి వెంకటస్వామి వివరించారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా, ఉపాధి హామీ సభ్యులు ఇందులో అభ్యాసకులుగా, అక్షరాస్యులుగా ఉన్న సభ్యులు వాలంటీర్లుగా ఒక్కొక్కరు 10 మందికి బోధిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె శిల్ప తదితరులు పాల్గొన్నారు.

# కులాల కుంపట్లు పెట్టి ప్రజలను రెచ్చగొడుతున్నారు

- బీజేపీ నేత,టీటీడీ సభ్యులు భానుప్రకాష్ రెడ్డి



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులుడైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు, బిజెపి నాయకుడు భానుప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ నెయ్యి కల్తీని పక్కదారి పట్టించేలా కులాల కుంపట్లు పెట్టి.. ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అసభ్య వ్యాఖ్యలు చేసే నాయకులను వెనకేసుకొచ్చేలా జగన్ వ్యవహరించడం దారుణమన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుమల క్షేత్రం చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ ప్రదక్షిణలు వేస్తే పుణ్యం వస్తుందని.. రాజకీయాలు చేస్తే వినాశనమే మిగులుతుందని హెచ్చరించారు. ఇటువంటి కుటిల రాజకీయాల కారణంగానే ఏపీ ప్రజలు వైసీపీ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. అయినా కూడా ఆ పార్టీ నేతల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదని విమర్శించారు. బుద్ధి లేకుండా స్వామివారితో రాజకీయాలు చేస్తారా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో వెంకటేశ్వర స్వామి ప్రసాదం తయారీలో వాడింది నెయ్యి కాదు అని సిట్ రిపోర్టు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ విషయాన్ని తప్ప మిగిలినవన్నీ మాట్లాడుతున్నారు. నెయ్యికి బదులుగా వాడింది ఏమిటో సూటిగా ఎందుకు సమాధానం ఇవ్వరు అని నిలదీశారు. తిరుమల పరకామణిలో దొంగతనం జరిగితే దాన్ని వైయస్ జగన్ చిన్న దొంగతనం అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదం నుంచి ప్రజల దృష్టి మరలించేందుకు కుల రాజకీయాలను తీసుకొస్తున్నారన్నారు. భోగి పండగకి డాన్సులు, దీపావళికి టపాసులు కాల్చుకోవడానికే మీ శేష జీవితం సరిపోతుందన్నారు. వైసీపీ నాయకులకు మరోసారి గెలిచే అవకాశం లేదన్నారు.

ఏపీని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ఇలాంటి ఎత్తుగడలు వేస్తూ డీవియేషన్ పాలిటిక్స్ చేస్తున్నారని తాము భావిస్తున్నాం అన్నారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ గా వైసీపీ నాయకులు మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. సిట్ నివేదికలో కోట్ల రూపాయలు హవాలా మార్గంలో చేతులు మారాయని పేర్కొన్నారని తెలిపారు. చిన్నప్పన్న ఎవరు? సుబ్బారెడ్డి టీటీడీ చైర్మనుగా ఉన్నప్పుడు తీర్మానంలో మార్పులు ఎందుకు తెచ్చారు? అనే వాటికి సమాధానాలు చెప్పాలన్నారు. నోటి దురుసుతో మాట్లాడి దాని వల్ల కలిగే పరిణామాలను కులాలు అంటగట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. అదేదో ఘనకార్యం చేసిన వ్యక్తికి మద్దతుగా వెళ్తున్నట్లు జగన్ గుంటూరు బయలుదేరి వెళ్లడానికి భానుప్రకాశ్ రెడ్డి తప్పుబట్టారు. ఇదంలా ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరుగుతోందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఒక అగ్నిగుండంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు.

# బీసీల సమస్యలపై కేసనతో చర్చించిన మంత్రులు, నాదెండ్ల, సత్య కుమార్ యాదవ్

- 60 ఏళ్ళు బీసీలకు సామాజిక పెంచల ఇవ్వాలి
- బీసీలకు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- మంత్రులను కోరిన రాష్ట్ర బీసీ సంఘం నేత కేసన శంకర్రావు
- కేసన ఇంట్లో మంత్రుల తేనీటి విందు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు" బీసీ బందు" కేసన శంకరరావు అహీర్ స్వగృహానికి, వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లు విచ్చేసి, రాష్ట్ర రాజకీయాలపై చర్చించి,తేనీటి విందు స్వీకరించడం సంతోషదాయకమన్నారు.

తెనాలిలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రులు ఈ సందర్భంగా బీసీల పలు సమస్యలపై కేసన తో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్డీఏ కూటమి ఎన్నికల వాగ్దానాలైన బీసీల రక్షణ చట్టం, 50 ఏళ్లు నిండిన బీసీలకు సామాజిక వృద్ధాప్య పెన్షన్లు, స్థానిక సంస్థలలో 34 శాతం, చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ల అమలు, డెడికేటెడ్ కమిషన్ ను వేసి జనగణనలో సమగ్ర కుల గణనను నిర్వహించుట వంటి కీలక అంశాలుపై చర్చలు జరిపినట్లు తెలియజేశారు. ముఖ్యంగా తెనాలి" ట్యాంక్ బండ్"పై సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని మనోహర్ ను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు అనేక దశాబ్దాలుగా వెనుకబడిన తరగతుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్న బీసీ బందు కేసనను అభినందిస్తూ, తమ దృష్టికి తీసుకొచ్చిన బీసీల సమస్యలన్నింటినీ సీఎంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు పలువురు బీసీ నాయకులు, మంత్రులకు శాలువాలు కప్పి-బోకెల నిచ్చి-పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ ఆరాటం

- బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో నితిన్ నబీన్



**తెలంగాణ (జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ఎవరికీ న్యాయం జరగలేదని బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ అమరులకు తాను శ్రద్ధాంజలి ఘటిస్తున్నానంటూ ప్రసంగాన్ని ఆరంభించారు. తెలంగాణ ఉద్యమంలో అలసట ఎరుగకుండా పోరాడిన వీరులకు నమస్కరిస్తున్నానని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఈ గడ్డ ఎదురొడ్డి పోరాడిందని కొనియాడారు.

**వక్ఫ్ బోర్డులను బలోపేతం చేసేందుకు యత్నం..**

: హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని పేర్కొన్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని కామెంట్ చేశారు. కొన్ని వర్గాలను సంతృప్తిపరచడానికి మాత్రమే వారు ప్రయత్నం చేస్తున్నారంటూ సెటైర్లు వేశారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వక్ఫ్ బోర్డులను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో కూడా ప్రభుత్వం భారీగా కోత విధిస్తోందని అన్నారు.

**కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాలి...**

: పలుచోట్ల హిందూ దేవాలయాలపై బహిరంగంగా దాడులు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపట్లేదని.. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను ఏమాత్రం సహించబోమని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో అన్నింటా విఫలమైందని ధ్వజమెత్తారు. రైతుభరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని.. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కమీషన్ల పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు చిన్న చిన్న కాంట్రాక్టర్లు కూడా ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. ఈ అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాలని నితిన్ నబీన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# కోటప్పకొండ తిరునాళ్లకు రూ. 30 లక్షలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 లక్షలు మంజూరు చేస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఫిబ్రవరి 4న నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్య ఏర్పాట్లు...వీఐపీ దర్శనం :** గత అనుభవాల ఆధారంగా వీఐపీ పాసుల బదులు వీఐపీ టికెట్లు మాత్రమే జారీ చేస్తారు. ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే వీలు కల్పిస్తారు. భక్తులు కేటాయించిన టైం స్లాట్‌లో మాత్రమే దర్శనం చేసుకోవాలి.

త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి ఒక ఉచిత లడ్డు అందజేస్తారు. భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరగా దర్శనం చేసుకునేలా విస్తృత ఏర్పాట్లు చేస్తారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రాకుండా, లిఫ్ట్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచుతారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. గత ఏడాది 550 బస్సులు నడిపితే, ఈ ఏడాది 618 బస్సులు కేటాయించారు. కొండపై నుంచి కిందికి భక్తులను తరలించడానికి మాత్రం 95 బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. రాత్రి పూట కొండపై ఉండే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. ప్రభల సమయంలో వెలుతురు నాణ్యతను మెరుగుపరిచే చర్యలు తీసుకున్నారు.

ఈ ఏర్పాట్లతో లక్షలాది మంది భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా చూస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

# నేడు గుంటూరులో డ్రగ్స్ పై సామాజిక దండోరా ర్యాలీ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** సమాజానికి, యువతకు ప్రాణహానీ కలిగించే డ్రగ్స్ పై గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో చలో గుంటూరు పేరిట సామాజిక దండోరా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య తెలిపారు. బుధవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. గుంటూరులోని జ్యోతి రావు పూలే విగ్రహం నుండి జాషువా విగ్రహం వరకు సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులు చైతన్య ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి గుంటూరు ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నజీర్, గుంటూరు జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొంటారని బాలకోటయ్య వివరించారు.

# జీజిహెచ్‌కు కార్డియాలజీ పరికరాలు



ఎస్‌బీఐ సిఎస్ఆర్ ద్వారా రూ. 4 కోట్ల సహాయం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అధునాతన వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా అమరావతిలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఇదే రోజు జాతీయ క్యాన్సర్ దినోత్సవం కావడం విశేషం.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) పథకం కింద రాంకీ ఎన్జీవో ద్వారా ఈ పరికరాలను జీజిహెచ్‌కు అందించనున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 4 కోట్ల వంకు ఉంటుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ముంబై హెడ్ ఆఫీస్ ప్రతినిధులు, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అండ్ శ్రీకాంత్ పాల్గొన్నారు. సిఎస్ఆర్ బహూకరణను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ స్వీకరించారు.

డాక్టర్ రమణ మాట్లాడుతూ, ఎస్‌బీఐ దాతృత్వాన్ని ప్రశంసించారు. ఈ పరికరాలు పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఎస్‌బీఐ జీజిహెచ్ బ్రాంచ్ మేనేజర్ జి. విజయసింహాతో పాటు ఎస్‌బీఐ సిబ్బందిని ఆయన అభినందించారు.

# ఎస్డీజీ సూచికల లక్ష్యాలు నూరు శాతం అధిగమించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో స్వర్ణాంధ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు నిర్దేశించిన సూచికలు నూరుశాతం అధిగమించేలా అన్ని శాఖలు పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్వర్ణాంధ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై అధికారులతో సమీక్షించారు. శాఖల వారీగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికలు జిల్లాస్థాయి, మండలస్థాయి లో నిర్దేశించిన లక్ష్యాలు, వాటిలో సాధించినవి, కీ పర్ఫామెన్స్ ఇండికేషన్లో (కేపీఐ) నమోదు చేసిన వివరాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికలకు సంబంధించి అన్ని శాఖలకు నెలవారీగా జిల్లా, మండల స్థాయి కి నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించేలా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సూచికల మ్యాపింగ్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఉండేలా ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి, మండల స్థాయిలో పూర్తి అయిన సూచికలు కేపీఐ లో నమోదు చేసి సంబంధిత రాష్ట్రస్థాయిలో కార్యాలయాల్లో ఆమోదించేలా జిల్లా అధికారులే పర్యవేక్షించాలన్నారు. ప్రతి నెల చివరి వారం అన్ని శాఖలు అధికారులతో సీపీఓ అధికారులు సమావేశం నిర్వహించి ఎస్డీజీ ఇండికేట్స్ కేపీఐ లో నమోదు, పెర్ఫార్మెన్స్ పై వివరాలు సిద్ధం చేసి అందించాలన్నారు.

సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వి జ్యోతి బసు, సీపీఓ శేషశ్రీ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఎస్ఈ హజరతయ్య, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, జిల్లా పశు సంవర్ధ శాఖ జెడీఏ కెవీవీ సత్యన్నారాయణ, డీపీఓ సాయి కుమార్, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి , ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఆర్టీసీ ఆర్ఎం జె.సామ్రాజ్యం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, ఎపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఎక్సైజ్ డీసీ అరుణ, ఐసీడీఎస్ పీడీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్, కంప్యూటర్ ట్యాలీ కోర్స్‌ల్లో ఉచిత శిక్షణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కారు డ్రైవింగ్, కంప్యూటర్ ట్యాలీ కోర్స్ ల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 2వ తేదీ నుంచి కారు డ్రైవింగ్, 9వ తేదీ నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్స్ ల్లో ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ శిక్షణకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు, మహిళలు దరఖాస్తు చేయవచ్చని చెప్పారు. ఉచిత శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయము, ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు. 19 నుంచి 50 సంవత్సరాలు వయస్సు కలిగి ఆసక్తిగల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధారకార్డు కాపీ, నాలుగు పాస్పోర్ట్సైజు ఫోటోలు, 10 వ తరగతి చదివుకుని ఉన్నట్టు కాపీ జత చేస్తూ ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు. డ్రైవింగ్ కోచింగ్ కు 4 వీలర్ లైసెన్స్ గాని ఎల్ ఎల్ ఆర్ గాని తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్ 14-1-14 డోర్ నెంబరు లో ఉన్న యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో సమర్పించాలని చెప్పారు. వివరాలకు 08632336912, 9700687696, 8125397953, 9949930155, 9703405066 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

# బ్రహ్మంగారిని దర్శించుకున్న వెంకట్



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని బుదవారం నాడు కడప జిల్లా ఒబిసి మోర్చా బీజేపీ అద్యక్షులు వెంకట్ నాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసారు. ఒబిసి మోర్చా బీజేపీ జిల్లా అద్యక్షులు వెంకట్ నాయుడు కు ఆలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికి పూలమాల శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం ఆయన దేవస్థాన మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారిని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం లో ఓబీసీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జ్యోతి ఓబీసీ ఉపాధ్యక్షులు దొమ్మర శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు రాము సంజీవ రాయుడు మరియు స్థానికులు తిప్పన మాధవనాయుడు ఆవుల దస్తగిరి నాయుడు సారె రామానాయుడు బోలా శ్రీనివాసులు పాల్గొన్నారు.



## వైవిద్యాన్ని గౌరవించేది హిందూ జీవనమే

- డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తి.తి.దే.
- వీరాపురం నందు ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**కర్నూలు, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**



హిందూ జీవనవిధానంలో మాత్రమే వైవిద్యాన్ని గౌరవించే సంస్కృతి కనిపిస్తుందని, అందుకే ఏ ఆరాధనా పద్దతులనుగానీ, ఏ ఆచార వ్యవహారాలనుగానీ తూలనాడదని, హిందూ జీవన విధానానికి దూరమైనవారిలో ఇవి కొరవడతాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం, వీరాపురం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలన వారు ప్రారంభించారు. ఈ సందర్బంగా ధర్మప్రచారకులు శ్రీ స్వాత్మానందస్వామీజీ శ్రీమద్రామాయణంపై ప్రవచించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు సోముల కృష్ణారెడ్డి, భక్తమండలి సభ్యులు ఎస్. నారాయణ రెడ్డి, శివరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, రామిరెడ్డి, పుల్లారెడ్డి, శివశంకర్ రెడ్డి, మల్లారెడ్డి, సోముల లక్ష్మీశ్వరమ్మ, లక్ష్మీదేవి, గీతా ప్రచారకులు బాణాల లక్ష్మీనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా వర్సిటీ మహిళా చెస్ చాంపియన్ కేబీఎన్




**విజయవాడ, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళా చెస్ పోటీలలో తమ కళాశాల విద్యార్థినులు చక్కని ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ చెస్ ఛాంపియన్లుగా నిలిచారని కె.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి తెలిపారు. ఇటీవల (జనవరి 31) గుడివాడ ఎ.ఎన్.ఆర్ కాలేజీలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థినులు జె. సాయి హర్షిత, జి. రాజరాజేశ్వరి, కె. పూర్విత అంజన రామచంద్ర, కె. హేమ విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాసు, హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావు, చెస్ కోచ్ పి.జ్యోతి కిరణ్ విద్యార్థులను అభినందించారు.

## వడ్లమాను గ్రామంలో మామిడి పరిశోధన, ఉద్యాన అనుభవాలతో సదస్సు



**నూజివీడు, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**

ఈరోజు వడ్లమాను గ్రామంలో రైతు సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సు గ్రామీణ ఉద్యాన అనుభవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయబడింది. ముఖ్యఅతిథిగా మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ బి.కె.ఎం లక్ష్మి హాజరయ్యారు. అదేవిధంగా, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం, మరియు ఆర్ హేమ, ఉద్యాన అధికారి, నూజివీడు నుంచి హాజరై రైతులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సదస్సులో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఉద్యాన ప్రదర్శనలు, అలాగే సేంద్రియ వ్యవసాయం మీద ప్రదర్శించిన నాటకం, రైతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త శాలి రాజు మామిడికి సంబంధించిన వివిధ సమస్యలు, ఉత్పత్తి రక్షణ కోసం వాడే విధానాలు తేనె మంచి పురుగు, తామర పురుగు, పండు ఈగ, కాయపెరుగుతో వచ్చే సమస్యలు, తెగుళ్లపై వివరించారు. ఉద్యాన కళాశాల వెంకటరమణ గూడెం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ వి. శేఖర్, వడ్లమాను గ్రామ నాయకులు, జలసూత్రం వంశీ, రైతు సేవ కేంద్రం సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో ఆర్ హేమ, ఉద్యాన అధికారి ద్వారా వివిధ రకాల సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు రైతులకు వివరించబడ్డాయి. కార్యక్రమంలో వడ్లమాను, ఆగిరిపల్లి, చొప్పరమెట్ల గ్రామాల రైతులు కూడా పాల్గొన్నారు.

## పలు సేవా కార్యక్రమాలలో పాలడుగు వెంకట శ్రీనివాసరావు



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 13 మంది దృష్టి లోపం కలిగిన బాల బాలికలకు విలువైన కళ్ళజోళు అందజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ప్రధాన పాత్రధారుడు ఇండియన్ గ్యాస్ అధినేత పాలడుగు వెంకట శ్రీనివాసరావు, మరియు ఎం ఐ ఒ శిలారపు హేబేలు చేతుల మీదుగా విరాళాలు పంపిణీ చేశారు. అంతేకాక, అకాడమిక్ లో మంచి ప్రతిభ కనబరిచిన 28 మంది విద్యార్థులు, విద్యార్థినులకు వెంకట శ్రీనివాసరావు రైటింగ్ పాడ్స్ను బహుకరించి వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం శ్రీ భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ మద్దతు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంలో పాఠశాల ఇంచార్జి హెచ్.ఎం. నాగరాజు లయన్స్ క్లబ్ మరియు వెంకట శ్రీనివాసరావు సేవలను అభినందించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు

# రైతులు, ప్రజల హక్కులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- భూహక్కులు పరిరక్షణకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ
- తిరువూరు ఆర్డీవో కె. మాధురి

**తిరువూరు, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**



రైతులు ప్రజల హక్కులకు భరోసా కల్పిస్తూ భూ హక్కుల పరిరక్షణకు రాజముద్రతో పట్టాదారులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తిరువూరు ఆర్డీవో కె. మాధురి అన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తిరువూరు మండలం లక్ష్మీపూరం గ్రామంలో మంగళవారం ఆర్డీవో కె. మాధురి గ్రామ సభ నిర్వహించి మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్డివో మాధురి మాట్లాడుతూ భూమిని నమ్ముకుని బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం అనేది ప్రథమ కర్తవ్యం కావాలని నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికార్లు పని చేసి రైతులకు కొత్త పట్టాదారుల పుస్తకాలు పంపిణీ చేయడంలో భాగస్వాములు కావడం జరిగిందన్నారు. రైతులకు సంబంధించిన పాత పుస్తకాలు బ్యాంకులో ఉంటే రెవిన్యూ సిబ్బంది స్వయంగా వెళ్ళి పాత పుస్తకాలు రద్దు అయ్యాయని వాటిస్థానంలో క్రొత్తపుస్తకాలు ఇస్తున్నామని, పాతవి తీసుకుని క్రొత్త పాసుపుస్తకాలు రైతులు సమక్షంలో బ్యాంకు అధికార్లకు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం లక్ష్మీపూరం గ్రామంలో చౌకధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నిత్యావసర వస్తువుల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనంతరం విజయ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ (రైస్ మిల్)ను తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు రికార్డుల నిర్వహణ పరిశీలించి ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అక్రమాలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కె. మాధురి తెలిపారు. కార్యక్రమంలో తిరువూరు తహశీల్దార్ వై. నాగమణి, పిడిఎస్ డిప్యూటీ తహశీల్దార్ శ్వేత, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూ యాజమాన్యంలో సరికొత్త ముందడుగు

- ఆధునిక సాంకేతికత, రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు
- భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కృషి
- భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు
- ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి

**జి.కొండూరు, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**



భూ యాజమాన్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, రైతుల శ్రేయస్సు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. ఆధునిక సాంకేతికత సహాయంతో భూ యాజమాన్య హక్కు పత్రం, పట్టాదారు పుస్తకాలను రాజముద్రతో అందిస్తోందని ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి అన్నారు. మంగళవారం జి.కొండూరు మండలం, గుర్రాజుపాలెంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఏపీ రీసర్వే ప్రాజెక్టు కింద రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా భూ యజమానులకు పట్టాదారు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ భూ రికార్డుల డిజిటలైజేషన్, సాంకేతిక ఆధునికీకరణ డేటా ద్వారా భూ సంబంధిత వివాదాలకు చెక్‌పెట్టడంతో పాటు రైతులకు సత్వర సేవలు అందుతాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా క్యూఆర్ కోడ్‌తో కూడిన సరికొత్త పట్టాదారు పుస్తకాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖ ద్వారా అత్యంత వేగంగా సేవలందేలా ఏర్పాట్లు చేశామని.. తహసీల్దార్లు, ఆర్‌డీవోలకు కూడా కొన్ని అధికారాలను బదిలీ చేసినట్లు తెలిపారు. ఎవరూ ఎక్కడికీ వెళ్లనవసరం లేకుండా మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి భూమి వివరాలు తెలుసుకునేందుకు వీలు ఏర్పడిందన్నారు. రెవెన్యూ సేవలతో పాటు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు వీలుగా జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు సీసీఎల్ఏ జయలక్ష్మి తెలిపారు.

**గ్రామాలను వివాద రహితంగా మార్చేందుకు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

శాటిలైట్ టెక్నాలజీ, జియో కోడ్స్ అనుసంధానంతో రాజముద్రతో సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలను భూ యజమానులకు అందజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. భూ సంబంధ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు ఈ పాసుపుస్తకాలు దోహదం చేస్తాయని.. హద్దులను మార్చేయడం వంటి మోసాలకు తావుండదన్నారు. ప్రకృతి విపత్తులు వచ్చినా అత్యంత కచ్చితత్వంతో మన భూములు, మన హద్దులు భద్రంగా ఉంటాయని వివరించారు. భూ సమాచారం డేటా సెంటర్‌లో భద్రంగా ఉంటుందని.. ఈ డేటాతో రైతులు సత్వర సేవలు పొందేందుకు వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరయ్యారు.

# చిన్నారుల చేతిలో మొబైల్ కాదుడ పుస్తకం ఉండాలి

- విజ్ఞానానికి విత్తనం చిన్నారుల గ్రంథ పఠనం
- మార్కుల కోసం పాఠ్యపుస్తకాలు చదివినా సమగ్రాభివృద్ధికి విలువైన గ్రంథాలు చదవాలి
- పిల్లల్ని గ్రంథాలయాలకు చేరువ చేసే ప్రయత్నాలు వేగవంతం కావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**



చిన్నారుల చేతిలో మొబైల్ కాదు.. పుస్తకం ఉండాలని, విజ్ఞానానికి విత్తనం గ్రంథ పఠనమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వారానికి ఒక రోజు విద్యాసంస్థలన్నింటిలోనూ ఒక ప్రత్యేక సెషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేసేలా ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమంగ – హైదరాబాద్ నుండి అమరావతికి పుస్తకంతో బస్సుయాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బస్సు యాత్ర చేరుకుంది. ఆ బస్సుయాత్రకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. బస్సుయాత్ర చేస్తున్న పుస్తక ప్రేమికుల్ని, రచయితల్ని, ఉద్యమకారుల్ని ఆత్మీయంగా పలకరించారు. బస్సుయాత్ర విశేషాలను ఉద్యమ సారథి మంచికంటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పెరిగిపోయిన మొబైల్ కల్చర్ను తగ్గించాలంటే బుక్ రీడింగ్ ఒక్కటే మార్గమన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు బాగా పెంచాలన్నారు. వాళ్ళను గ్రంథాలయాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నా రు. ఆ దిశగా ఉద్యమిస్తున్న మరో గ్రంథాలయ ఉద్యమ నాయకు లందర్నీ అభినందించారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోనూ విద్యాలయాల్లో వారానికి ఒక్కరోజు పాఠ్యాంశేతర పుస్తకాలను చదివే విధంగా ఒక సెషన్ ఏర్పాటు చేసేలా ఉపాధ్యాయుల్ని ప్రోత్సహిస్తామన్నారు. అవకాశమున్న పార్కుల్లో మినీ మొబైల్ గ్రంథాలయాల ఏర్పాటు గురించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా 'జయహో పుస్తకం' పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నవ మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, సీనియర్ జర్నలిస్టు యేమినేని వెంకటరమణ సారథ్యం వహించారు. కార్యక్రమంలో మంచికంటి, బండారు విజయ, కాసుల రవికుమార్, సీఏ ప్రసాద్, కాంతి నల్లూరి, పైడిమర్రి విజయ, కందుకూరు రాము, కస్తూరి ప్రభాకర్, కాసుల శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

### బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్

# ఒత్తిడికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

- వక్ఫ్ భూముల భూ సేకరణ ఉపసంహరణ దిశగా అడుగులు

**గుంటూరు, ఫిబ్రవరి 04 (జర్నలిస్ట్ ఫైల్)**



గుంటూరు జిల్లా చినకాకాని గ్రామంలో గల గుంటూరు అంజుమన్-ఇ-ఇస్లామియా సంస్థకు చెందిన 71.57 ఎకరాల వక్ఫ్ భూములను భూ సేకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడం తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో జనవరి 19న బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ముస్లిం సంఘాల నాయకులతో కలిసి వక్ఫ్ భూములను ప్రత్యక్షంగా పరిశీలించారు. వక్ఫ్ భూముల టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చలేమని, వక్ఫ్ చట్టాలకు అనుగుణంగా పీపీపీ మోడ్ లేదా లాంగ్ లీజు రూపంలో మాత్రమే వినియోగానికి ఇవ్వవచ్చని స్పష్టం చేస్తూ అధికారికంగా లేఖ పంపారు. వక్ఫ్ చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ భూ సేకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ద్వారా 71.57 ఎకరాల అంజుమన్ వక్ఫ్ భూములను పీపీపీ మోడ్ లేదా లాంగ్ లీజు కింద ఇవ్వడంపై బోర్డులో తీర్మానం చేసి పంపాలని ఆదేశిస్తూ మెమో జారీ చేసింది. ఈ అంశాన్ని ఫిబ్రవరి 5న జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సమావేశం అజెండాగా చేర్చనున్నారు. సమావేశంలో నిర్ణయం తీసుకొని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ "ఈ వక్ఫ్ భూములను వక్ఫ్ లీజ్ రూల్స్2014 ప్రకారం లాంగ్ లీజుకు మాత్రమే ఇవ్వాలి. ఆ లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని అంజుమన్ సంస్థ ఆశయాలు, సామాజికవిద్యాసంక్షేమ కార్యక్రమాల అమలుకు వినియోగించాలి" అని స్పష్టం చేశారు.వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజీలేని పోరాటం కొనసాగుతుందని, వక్ఫ్ చట్టాలకు విరుద్ధంగా జరిగే ఏ ప్రయత్నాన్నైనా ప్రజా ఉద్యమంగా అడ్డుకుంటామని బిసివై పార్టీ స్పష్టం చేస్తుందని అన్నారు.

## మాజీముఖ్యమంత్రి పరామర్శల తీరు హాస్యాస్పదం



**○ టిడిపి లీగల్ సెల్**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వయస్సు,హోదా ఎంతో ఉన్నతమని, అటువంటి వారిని అసభ్య పదజాలంతో దూషించి జైలు పాలైన వ్యక్తిని పరామర్శించడానికి, ఒక మాజీ ముఖ్యమంత్రి రావడం సిగ్గుచేటని టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు ఇందుపల్లి రాజారాం ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ నేతలు బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుపల్లి రాజారాం మాట్లాడుతూ ఒక మాజీ ప్రజా ప్రతినిధి,మాజీ మంత్రి అయ్యుండి నోటికి హద్దు అదుపు లేకుండా సభ్యసమాజం తల దించుకునేలా మాట్లాడిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి సాక్షాత్తు ఒక మాజీ ముఖ్యమంత్రి రావడం ఆక్షేపనీయమని అన్నారు. సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ఏ నాడు ఎవ్వరిని తూలనాడిన వ్యక్తి కాదని,ఏనాడు చట్టాన్ని ధిక్కరించిన దాఖలాలు లేవని,అదే సందర్భంలో అధికారాన్ని తన వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోలేదని అటువంటి వ్యక్తిని నోటికొచ్చినట్టు మాట్లాడడం తగదన్నారు. టీడీపీ పట్టణ టిఎన్టియుసి అధ్యక్షులు అన్నం పిన్నారావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పరామర్శ అంటే ప్రజలు నవ్వుకునే పరిస్థితి అని ఎందుకంటే ఆయన ఓడిపోయినప్పటి నుండి ఆయన పరామర్శలు హంతకులను జైలులో పరామర్శించడం,గంజాయి కేసులతో బెయిల్ పై బయటకు వచ్చిన వారిని,రౌడీ షీటర్లను పరామర్శించడానికి మాత్రమే వస్తారని జనం నవ్వుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మద్ది మల్లిఖార్జునరావు, రాళ్ళపల్లి అనిత,కోటా రమేష్, శ్రీనివాస గౌడ్,కిషోర్, వేములపల్లి శ్రీనివాస్, పూర్ణ,శ్రీలక్ష్మి,బాలకృష్ణ తదితరులున్నారు.

## శ్రీ ఈశ్వరీ దేవి మఠంకు వేలం పాటల ద్వారా 4,58,500 ఆదాయం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లి గ్రామంలో నెలకొని ఉన్న శ్రీ ఈశ్వరీదేవిమఠం నందు కడప జిల్లా దేవాదాయ శాఖ అధికారి శంకర్ బాలాజీ ప్రత్యేక పర్యవేక్షణలో భక్తులు గ్రామస్తుల సమక్షంలో బుధవారం కొబ్బరి చిప్పలు సేకరణ హక్కుకుగాను రూ. 2,60,000,పాదరక్షలు భద్రపరచుటకు హక్కుకుగాను రూ. 18,000, మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్వహణ, రుసుము వసూలు చేసుకొను హక్కుకుగాను రూ. 1,77,000,అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు గాను రూ.3500 వేలంపాటల ద్వారా మొత్తం రూ. 4,58,500మఠమునకు ఆదాయం వచ్చినదని శ్రీ ఈశ్వరీదేవిమఠం కార్యనిర్వాహణాధికారి బివి జగన్మోహన్ రెడ్డి గారు తెలిపారు.

## మాదక ద్రవ్యాల మత్తును తరిమేద్దాం




**○ రూరల్ సిఐ ఎ.వి. బ్రహ్మం**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపరచి సంకల్పంతో మత్తును తరిమేద్దామని మంగళగిరి రూరల్ సిఐ ఎ.వి. బ్రహ్మం అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్సకాలనీ, ఎంటీఎంసీ హైస్కూల్లో బుధవారం 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు సంకల్పం పోస్టర్ను ఆవిష్కరించారు. సిఐ బ్రహ్మం మాట్లాడుతూ వ్యసనాలకు డబ్బులు ఖర్చు చేస్తూ మద్యం, మత్తు కలిగించే వాటి పట్ల యువత ఆకర్షితులు అవుతూ పక్కదాని పడుతున్నారన్నారు. వీటిని నియంత్రించే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. అక్రమంగా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నా. కలిగియున్నా, విక్రయిస్తున్నా వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువతపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. సమాజానికి హాని కలిగించే మాదక ద్రవ్యాల నియంత్రణకై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, స్థానిక టిడిపి నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు మంత్రి సానుకూల హామీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్రరావు ఆహ్వానం మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం వారి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య సేవల అవసరం అధికంగా ఉందని, ప్రజలకు సమయానికి మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ విజ్ఞప్తికి మంత్రి సత్య కుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన సాంకేతిక నివేదికలు సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న పథకాల ద్వారా గుంటూరు పశ్చిమంలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ కూడా పాల్గొని, ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఈ సమావేశం గుంటూరు పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాల దిశగా కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.

## ముగిసిన శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి వార్షిక బ్రంహోత్సవాలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే తిరుప్పావై సేవను తలపించే తీరుగా,తెనాలి పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానములో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా వైఖానస ఆగమ రీతిన నిర్వహించిన తిరుప్పావై సేవ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

స్థానిక షరాబ్ బజార్లో వేంచేసి ఉన్న శ్రీ సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా, బుధవారం తిరుప్పావై సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి ప్రసాద్ పర్యవేక్షణలో, ఆలయవంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో, వైఖానస పండితులు తిరుప్పావై సేవను ఘనంగా నిర్వహించారు. 108 కేజీల పులిహోరను, రాసి పోసి, పంచాహ్నిక దీక్షగా, విశేష పూజలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి హరి ప్రసాద్ మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా తిరుప్పావై సేవ వైభవంగా నిర్వహించుకోవడం, భక్తులు విశేషంగా పాల్గొనడం ఓ ఆచారంగా కొనసాగుతుందన్నారు. ఆలయ అర్చకులు, ప్రపంచముఖ ఆంజనేయ స్వామి సేవా సమితి అధ్యక్షులు ఆర్ వి కిరణ్ మాట్లాడుతూ తిరుప్పావై సేవ విశిష్టతను వివరించారు. 108 కేజీల పులిహోర స్వామివారికి నివేదన చేసిన తీరును వివరించారు. సంజీవి పర్వతాన్ని ఎత్తిన ఆంజనేయస్వామి ఆకృతిలో, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే తెనాలి శాఖ అధ్యక్షులు, ఐజేయూ సభ్యులు చందు సుబ్బారావు మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి ఉన్న విశిష్టత క్రమంలో, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం, ప్రతిఏటా ఓ కార్యాచరణంగా కొనసాగుతుందన్నారు. తిరుప్పావై సేవా కార్యక్రమం అనంతరం వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం మహిళా సభ్యులు, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

**○ తుళ్లూరులో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు**



**గుంటూరు(జర్నలిస్ట్. ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గుంటూరు జిల్లా పోలీస్ శాఖ తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్టమైన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. నేడు రాయపూడి గ్రామం వద్ద ఎంఎల్ఏ క్వార్టర్స్ నుంచి హైకోర్టు వైపు వెళ్లే రహదారిలోని పెరేడ్ గ్రౌండ్‌లో "మన నీరు – మన భవిష్యత్తు: నీటి వినియోగదారుల సంఘాల పాత్ర" అనే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృత స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఎల్ అండ్ ఓ) ఏటీవీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు పోలీస్ అధికారులు భద్రతా చర్యలపై వివరాలు అందజేశారు. సుమారు 6,000 మంది హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్, ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులను మోహరించి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గంలో వీఐపీ రూట్ క్లియరెన్స్, రూట్ సెక్యూరిటీ, ముందస్తు తనిఖీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. సభా ప్రాంగణంలో అంచెల వారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, తగిన సంఖ్యలో భద్రతా సిబ్బంది మోహరించారు.

కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాత్సవ, అదనపు ఎస్పీ, గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, తుళ్లూరు డీఎస్పీ, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, తుళ్లూరు పోలీస్ స్టేషన్ సీఐ మాతంగి శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్-2కే26 ప్రారంభం

**○ జాతీయ స్థాయిలో పోటీలు**
**○ విజేతలకు రూ.15 లక్షలకు పైగా నగదు బహుమతులు**
**○ పోటీలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న మరో అతిపెద్ద యూత్ ఫెస్టివల్ "విజ్ఞాన్ మహోత్సవ్–2కే26"కు సన్నాహాలు పూర్తయ్యాయని వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మహోత్సవ ప్రారంభ వేడుకలకు ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే 7వ తేదీన జరిగే ముగింపు వేడుకలకు 2025 ఏసియన్ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్, భారత హెప్టాథ్లెట్ నందిని అగసారా ముఖ్య అతిథిగా పాల్గొంటారని ప్రకటించారు. అదే విధంగా మహోత్సవ్‌లో రెండో రోజున ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం, మూడో రోజున ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ దీక్షిత్ శెట్టి సందడి చేస్తారని వెల్లడించారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మందికి పైగా విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. పోటీల విజేతలకు మొత్తం రూ. 15 లక్షలకు పైగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా విజ్ఞాన్ మహోత్సవ్ ఇప్పటికే జాతీయ స్థాయిలో ఒక విశ్వసనీయ బ్రాండ్‌గా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

**80 కు పైగా ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో మొత్తం 80కు పైగా ఈవెంట్లు నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్ విభాగంలో పారా స్పోర్ట్స్, ట్రాక్ అండ్ ఫీల్డ్, యోగా, పారా క్రికెట్, టెన్నికాయిట్, తైక్వాండో, ఫుట్‌బాల్, ఖో–ఖో, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యూజిక్, డాన్స్, డ్రామాటిక్స్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్ అండ్ క్రియేటివ్ మీడియా, లిటరేచర్, విజువల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ స్టైలింగ్, స్పాట్‌లైట్, గేమింగ్, రోబో గేమ్స్, లిటరరీ ఈవెంట్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ వంటి సాంకేతిక, సాంస్కృతిక విభాగాల్లో కూడా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడమే కాకుండా, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం వంటి నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ కేవలం పోటీలకే పరిమితం కాకుండా, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే మహా వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు పాల్గొన్నారు.

## మిర్చి రైతులకు అండగా నిలవాలి



**○ అన్నదాతకు భరోసా కల్పించడమే లక్ష్యం కావాలి**
**○ మిర్చి యార్డు వైస్ చైర్మన్ తో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు(జర్నలిస్ట్. ఫైల్):** మిర్చి యార్డుకు వచ్చే రైతులకు అండగా నిలుస్తూ, భరోసా కల్పించడమే లక్ష్యం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మిర్చి యార్డు వైస్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన బిట్రగుంట్ల మల్లిక బుధవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ను స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ కి పుష్పగుచ్ఛం అందజేసి, తనపై ఉంచి మిర్చి యార్డు వైస్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మైనార్టీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ మాట్లాడుతూ మిర్చి యార్డు అభివృద్ధికి ప్రతి నిత్యం కృషి చేయాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ముందుండాలన్నారు. యార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం నిబద్ధతతో పని చేయాలని, మిర్చి రైతులకు న్యాయమైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లావాదేవాలు పారదర్శకంగా నిర్వహించాలని, ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకూడదని సూచించారు. యార్డు పరిధిలో సౌకర్యాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలు, వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఆసియా ఖండంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న మిర్చి యార్డు ప్రతిష్టను మరింత ఉన్నతంగా మార్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బ్రహ్మంగారి హుండీ ఆదాయం 31 లక్షలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం లో హుండీలను లెక్కించగా 30లక్షల94వేల989 రూపాయలు ఆదాయం వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆధ్వర్యంలో 65 రోజులకు గాను 8హుండీల లెక్కింపు జరిగినది అలాగే గోల్డ్ 7 గ్రాములు వెండి 221 గ్రాములు వచ్చిందని ఈ హుండీల లెక్కింపునకు కడప జిల్లా దేవ దాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర బాలాజీ హాజరైయ్యారు. సేవ సమితి వారు చేత ఈ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు.

## నేటి నుండి హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్‌లో పునరుద్ధాన పండుగలు : బ్రదర్ సాల్మన్





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ ప్రాంగణంలో ఈనెల 5వ, తేదీ నుండి 8వరకు,వరుసగా నాలుగు రోజులు నిర్వహించే పునరుద్ధాన పండుగలకు హాజరయ్యే విశ్వాసులకు కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సభల నిర్వాహకులు సాల్మన్ పేర్కొన్నారు. స్థానిక చెంచుపేట ప్రభుత్వ వైద్యశాల రోడ్ లోని, ఇండోర్ స్టేడియం వెనుకగల, హోసన్న ప్రేయర్ మినిస్ట్రీస్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హోసన్న ప్రేయర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు సాల్మన్ మాట్లాడుతు గత 18 సంవత్సరాలుగా పునరుద్ధాన పండుగలు ఫిబ్రవరి మాసంలో ఓ కార్యాచరణగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5 వ తేదీన ప్రారంభమయ్యే పునరుద్ధాన పండుగల ద్వారా తెనాలి పట్టణంలోని అన్ని వర్గాల వారు మేళ్ళను పొందుకోవాలని, వివిధ ప్రాంతాల దైవజనులు ప్రత్యేక ప్రార్ధనలు చేయడంతొ పాటు, దైవ వాఖ్యాన్ని వెల్లడి చేస్తారని తెలిపారు. 8వ,తేదీవరకు ప్రతి రోజు మూడు పూటల దైవసేవకుల సందేశాలు ఉంటాయన్నారు. 18వ, పునరుద్ధాన పండుగల నిర్వాహణలో, విశ్వాసుల కోసం ప్రత్యేక వాఖ్య సేవలు ఉంటాయన్నారు.

రాష్ట్రం లోని అనేక ప్రాంత్రాల దైవజనులు హాజరయ్యే పండుగలకు పట్టణ పరిసర ప్రాంతాల వారిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా హాజరయ్యే దైవసేవకులు, రాజారావు, ఎదురుమొండి మోజస్ దేవదాసు, అక్షయ్ లు వారి ప్రాంతాల్లో విరివిగా వాడబడుతున్న దైవజనులని, వారి వివరాలు వెల్లడించారు.

పునరుద్ధాన పండుగలు ప్రయోజన కరంగా కొనసాగాలని పలువురు దైవజనులు తమ అభిప్రాయాలను మీడియాతొ పంచుకున్నారు.

.క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసులకు ఏసుక్రీస్తు బైబిల్ లో పొందుపరిచిన అంశాలపై ప్రముఖ దైవసేవకులతో పరిచర్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రచార కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో దైవసేవకులు కారుమూరి జకరయ్య, ఎన్ చిట్టిబాబు, ఎం సంసోను, టి దేవయ్య, డి సురేష్ తదితరులు పాల్గున్నారు.

## బిసిల డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమమే



**○ ఈనెల 22న బిసి సింహ గర్జన**
**○ బీసీల స్వాతంత్ర్య పోరాటానికి నాంది బీసీ సింహగర్జన.**
**○ నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో కార్యక్రమం**
**○ కమిటీల ప్రమాణ స్వీకారంలో బిసివై అధినేత బోడె రామచంద్రయాదవ్**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను దశాబ్దాలుగా మోసం చేస్తూ, వారి ఐక్యతను దెబ్బతీస్తున్న టీడీపీ, వైసీపీ పార్టీల రెండు నాల్కల ధోరణికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఉద్ఘాటించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో, ఫిబ్రవరి 22న జరగనున్న చారిత్రాత్మక "బీసీ సింహగర్జన" మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీల ఆత్మగౌరవం, అధికారం కోసం జరిగే ఈ స్వాతంత్ర్య పోరాటంలో ప్రతి బీసీ బిడ్డ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీసీలపై ప్రేమ ఒలకబోయడం, అధికారంలోకి వచ్చాక వారిని అణచివేయడం ప్రధాన పార్టీలకు అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత బీసీలను పూర్తిస్థాయిలో వంచించే కార్యక్రమం జరిగిందే తప్ప, వారికి మేలు చేసింది శూన్యమన్నారు. తమ పార్టీ, బీసీ సంఘాలతో కలిసి డిసెంబర్ 11న బీసీల ప్రధాన సమస్యలపై చర్చించి, ప్రభుత్వానికి డిమాండ్లు సమర్పించినా, వాటిని పరిష్కరించాల్సింది పోయి బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు, కుట్రపూరితంగా చీలికలు తెచ్చేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విజయవాడ–గుంటూరు హైవేలో, నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా, "పూలే–అంబేద్కర్ ప్రాంగణం"గా నామకరణం చేసిన వేదికపై లక్షలాది మందితో జరగనున్న "బీసీ సింహగర్జన" ద్వారా ఐదు ప్రధాన డిమాండ్లతో ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బీసీలపై జరుగుతున్న దాడులు, హత్యలపై కనీస స్పందన లేని ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తక్షణమే "బీసీ రక్షణ చట్టం" అమలు చేయాలనేది మొదటి డిమాండ్ అని తెలిపారు. అమరావతిలో సేకరించిన 33 వేల ఎకరాల భూమిని చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని, 50% ఉన్న బీసీలకు అందులో వాటా ఎంత అని ప్రశ్నించారు. బీసీ పారిశ్రామికవేత్తలకు, కుల సంఘ భవనాలకు కనీసం వెయ్యి ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తన బినామీలకు ఎంత రేటుకు కేటాయిస్తున్నారో బిసిలకు కూడా అదే ధరకు కేటాయించాలనేది రెండో డిమాండ్ అని తెలిపారు. నిర్వీర్యం చేయబడిన బీసీ కులాల కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి, చేతివృత్తుల వారికి అండగా నిలవాలనేది తమ మూడో డిమాండ్ అని రామచంద్రయాదవ్ తెలిపారు.

రాష్ట్రంలో వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా కులగణన చేయాలనేది తమ నాలుగవ డిమాండ్ అని తెలిపారు. కులగణన ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు అమలు చేసి తీరాలని... ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదనేది తమ అయిదో డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. మహాసభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాదని, బీసీల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామని రామచంద్రయాదవ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వం–కు జరిగే ఈ కార్యక్రమంలో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన శ్రీకృష్ణుడు–జాంబవతిల కల్యాణ మహోత్సవాన్ని యాదవ, మాదిగ దంపతులతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**ప్రమాణ స్వీకార కార్యక్రమం**

పోస్టర్ ఆవిష్కరణ అనంతరం, పార్టీలో నూతనంగా నియమితులైన వివిధ కమిటీల సభ్యులచే బోడె రామచంద్రయాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, బీసీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పనిచేయాలని ఆయన నూతన నాయకులకు దిశానిర్దేశం చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సంత్ రవిదాస్ జయంతి : బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 500కుపైగా కార్యక్రమాలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):**సంత్ రవిదాస్ జీ 649వ జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సుమారు 500కు పైగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు.
విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంత్ రవిదాస్ వారసులను సత్కరించిన అనంతరం మాధవ్ మాట్లాడారు. ఎస్సీ వర్గానికి చెందిన వారు ఇప్పటికీ చెప్పులు కుట్టే సంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్నారని, ఆ వృత్తిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మానవ సంచారం, నాగరికతకు పాదరక్షలే ఆధారం అని, ఏ దేవుడిని పూజించినా పాదుకలను పూజించే సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప వృత్తిలో జన్మించిన సంత్ రవిదాస్ వారణాసి ప్రాంతంలో సమతా, సౌభ్రాతృత్వ సందేశాలను ప్రజల్లో వ్యాప్తి చేశారని తెలిపారు. ప్రపంచం మొత్తం దేవుడి సృష్టేనని, ఎవరూ ఎక్కువ--తక్కువ కాదనే తత్వాన్ని సంత్ రవిదాస్ తన కీర్తనల ద్వారా చాటి చెప్పారని మాధవ్ అన్నారు. సుమారు 140 అమృత వాణీలను రచించి సమతా సమాజ నిర్మాణానికి పునాది వేశారని, గురు నానక్‌తో సమకాలికుడైన రవిదాస్ గేయాల ఆధారంగానే గురు గ్రంథ్ సాహెబ్‌కు రూపు వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా చెప్పులు కుట్టే వృత్తిలో ఉన్నవారికి సర్టిఫికెట్లు, సంత్ రవిదాస్ ఫోటోలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతాల సురేష్ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇది అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల కార్యక్రమం అధ్యక్షులు లంకా దినకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, జిల్లా కార్యదర్శి సురేష్, మీడియా ప్యానెలిస్టు ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.
ఇదే సందర్భంగా కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని మీడియా ప్రశ్నకు మాధవ్ సమాధానమిచ్చారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ నెల 7న విజయవాడలో బడ్జెట్ వివరించేందుకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కర్నూలు, నెల్లూరు, తిరుపతి నగరాల్లో కూడా "వికసిత ఆంధ్రప్రదేశ్"కు కేంద్ర బడ్జెట్ ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు వివరించే కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

## క్యాన్సర్ టెర్మినాలజీ గ్రంథం ఆవిష్కరణ



○ **వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా గుంటూరు జీజీహెచ్‌లో కార్యక్రమం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా బుధవారం ప్రభుత్వ సమగ్ర వైద్యశాల--నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో పెద్ది సాంబశివరావు సమీకరించి ప్రచురించిన 1000 పేజీల క్యాన్సర్ టెర్మినాలజీ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎస్. ఎస్. వి. రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంగ్లీష్, తెలుగు పరిభాషలలో వేల పదాలకు వివరణలతో రూపొందిన ఈ గ్రంథం డాక్టర్లు, నర్సులు మాత్రమే కాకుండా సామాన్యులకు కూడా ఉపయోగపడే విధంగా ఉందని డా. రమణ తెలిపారు. వైద్య పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఇది కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.
నాట్కో ట్రస్ట్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ, రచయిత గతంలో ప్రచురించిన మెడికల్ డిక్షనరీ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పుడు క్యాన్సర్‌కు సంబంధించిన పదాలను సులభంగా అర్థమయ్యేలా ఈ గ్రంథాన్ని అందుబాటులోకి తీసుకురావడం ప్రశంసనీయమన్నారు.
ఈ కార్యక్రమంలో క్యాన్సర్ సెంటర్‌కు చెందిన వైద్యులు డా. జి. దుర్గాప్రసాద్, డా. టి. శివరామకృష్ణ, డా. వెంకా రెడ్డి, డా. శ్రీకన్య, డా. సునీత, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయకుమారి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్, పీజీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల సమావేశాన్ని జయప్రదం చేయండి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) :** నీటి సంరక్షణ- భద్రత- భవిష్యత్తు సాగునీటి సంఘాల పాత్ర అంశంపై ఫిబ్రవరి 5వ తేదీన సాగునీటి సంఘాల అధ్యక్షులతో సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించే సమావేశానికి వినుకొండ నియోజకవర్గం లోని సాగునీటి సంఘాల అధ్యక్షులు అందరూ తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు బుధవారం కోరారు. నీటి యాజమాన్య పద్ధతులపై దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. గత వైసిపి పాలనలో జరిగిన తప్పిదాలను సరి చేసుకుంటూ ఇరిగేషన్ రంగాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారని అన్నారు. సమావేశానికి నేటి సంఘాల అధ్యక్షులు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆయన కోరారు.

## నేడు మైనార్టీ మోర్చా సమావేశం

○ **విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీ**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):**భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా అధ్యక్షతన గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్రకార్యాలయంలో మైనార్టీ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు దిశానిర్దేశం చేయనున్నారు. రాబోయే రోజుల్లో మైనార్టీ మోర్చా చేపట్టే కార్యాచరణపై మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. సమావేశంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ఇన్చార్జిలు, రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జోనల్ ఇన్చార్జిలు, జిల్లా ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

# కమ్మజన సేవాసంస్థ ద్వారా మెరుగైన సేవలకు దోహదం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** దారిద్ర్య రేఖకు దిగువనున్న కమ్మ సామాజికవర్గ బాలికల విద్యావ్యాప్తి లక్ష్యంగా భవన నిర్మాణం చేయాలన్న సంకల్పానికి,కుమార్ పంప్స్ సంస్థ వ్యవస్థాపకులు కొత్త సుబ్రహ్మణ్యం స్థలం సేకరణ విషయంలో తోడ్పాటు ఇవ్వడం గొప్పవిషయమని, ఈమహాయజ్ఞానికి పొట్లూరి రామ్మోహనరావు శోభారాణి దంపతులు భారీ విరాళం అందజేయడం శుభపరిణామని కమ్మజన సేవాసమితి ఆలోచనలు త్వరిత గతిన కార్యరూపం దాల్చాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆ సంస్థకు అభినందనలు తెలిపారు.
స్థానిక బుర్రిపాలెం రోడ్డు లోని సూపర్ స్టార్ కృష్ణ ఇంటి వీధిలోగల, పొట్లూరి రామ్మోహనరావు నివాసంలో బుధవారం కమ్మజన సేవాసమితి సభ్యుల సమావేశం నిర్వహించగా, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేందర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాకతీయ కమ్మ జన సేవా సమితి ద్వారా భవిష్యత్తు కార్యాచరణ పై సభ్యులు సమీక్షించారు.
కమ్మ సమాజంలోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న, బాలికల విద్యా వ్యాప్తి కోసం సమిష్టి భాగస్వామ్యంతో కృషి చేయాలన్న తీర్మానం చేశారు. కమ్మజన సేవాసమితి స్థల సేకరణలో,కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం వారి వంతు ప్రోత్సాహాన్ని అందించిన క్రమంలో, ఆ స్థలంలో ఏర్పాటు చేసే భవనం ద్వారా కమ్మ సామాజిక వర్గంలో, ఆర్థిక స్థితిగతులు సరిగా లేని ఆడపిల్లల విద్యా వికాసం కోసం వసతి ఏర్పాటు చేయాలన్న భావనను కొత్త సుబ్రహ్మణ్యం వ్యక్తం చేశారు. ఎవరి వంతు వారు, వారి స్థాయికి తగిన విధంగా కమ్మజన సేవాసమితి కార్యక్రమాలకు తోడ్పడాలని కోరారు.
ఈ సందర్భంగా పొట్లూరి రామ్మోహనరావు శోభారాణి దంపతులు తమ వంతుగా 10లక్షల, వెయ్యి, 116 రూపాయల చెక్కును, పట్టపద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా, కమ్మ జన సేవా సమితి బాధ్యులకు అందజేశారు. అదేవిధంగా 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ ఒక లక్ష 12 వేల,5వందలు, ఆలపాటి పద్మావతి 25వేలు,తమ వంతు విరాళంగా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కమ్మ సమాజంలో ఆర్థిక లేమితో బాధపడుతున్న వారి ప్రయోజనం కోసం, సంస్థను ఏర్పాటు చేసుకుని,తోడ్పాటు అందించాలన్న సంకల్పం గొప్పదని అన్నారు. శారీరకంగాసేవ అందరూ చేస్తారని, సహాయం చేయడం కొందరి వల్లే సాధ్యపడుతుందని, కమ్మ సమాజ పరిరక్షణ కోసం రూపుదిద్దుకున్న సేవా సమితికి,ఇతోదికంగా సామాజిక వర్గంలోని ఆర్థిక పరిపుష్టి గల ప్రతి ఒక్కరూ,ఎవరి వంతు వారు సహాయం అందజేయడం ద్వారా, బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని సుధాకర్, డిఎల్ కాంతారావు, వీరమాచినేని వెంకటేశ్వరరావు, అమిరినేనిరాజ, ఈదర వెంకట పూర్ణచంద్, రావి చిన్ని, కోగంటి రోహిత్,సుంకర హరికృష్ణ కమ్మ జన సేవా సమితి బాధ్యులు, సభ్యులుపాల్గొన్నారు.

# నేతన్నల హామీలు నెరవేర్చుతున్నాం : మంత్రి సవిత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** చేనేతలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టంచేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను బుధవారం ఏపీ పద్మశాలీ సంఘం, చేనేత సంఘ ప్రతినిధులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిశారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై వారు హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వాల పాలనలోనే చేనేతకు స్వర్ణయుగమన్నారు. ఆనాడు ఎన్టీఆర్... నేతన్నలకు అండగా నిలిచారన్నర్ను. నేడు సీఎం చంద్రబాబునాయుడు చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో నేతన్నల కష్టాలను మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా చూశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, చేనేతలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఎన్నికల హామీలను నెరవేర్చుతున్నారన్నారు. నేతన్నలకు 50 ఏళ్లకే రూ. 4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. నూలు కొనుగోలుపై 15 శాతం రాయితీ అందజేస్తున్నామన్నారు. జనవరిలో చేనేత సహకార సంఘాలకు రూ. 7 కోట్ల బకాయిలు అందజేశామని, రూ. 1.67 కోట్ల త్రిఫ్ట్ నిధులు ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయాలని నిర్ణయించామన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ పథకం అమల్లోకి రానుందన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేయనున్నామన్నారు. ఈ పథకం వల్ల 1,03,454 కుటుంబాల్లో నాలుగు లక్షల మందికి లబ్ధి చేకూరనుందన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సహకాయంలో టెక్స్ టైల్స్ పార్కులు, మెగా క్లస్టర్లు, క్లస్టర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యమన్నారు.
అంతకుముందు ఏపీ పద్మశాలీ సంఘ ప్రతినిధులు మంత్రి సవితను కలిసి, పలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. వచ్చే ఏప్రిల్ 26న మంగళగిరిలో పద్మశాలీ రాష్ట్ర మహా సభ నిర్వహించనున్నామని, ఆ సభలో పాల్గొనాలని మంత్రి సవితను ఆహ్వానించారు. ఇందుకు మంత్రి సవిత సుముఖం వ్యక్తంచేశారు.
ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలీ సంఘం, చేనేత సంఘ ప్రతినిధులు జె.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వెంకట సాంబశివరావు, కొల్లి బాబూరావు, గౌరీ శంకర్రావు, తుమ్మలచర్ల గణపతి ఉన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ ఔట్‌రీచ్ కార్యక్రమాలు

○ **రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి బడ్జెట్ ప్రయోజనాలు**

○ **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రతి వర్గాన్ని సమానంగా దృష్టిలో ఉంచుకొని దేశాభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన ఈ బడ్జెట్ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నో అవకాశాలను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. "వికసిత ఆంధ్రప్రదేశ్" లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి లభించిన వెసులుబాట్లు, అభివృద్ధి అవకాశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర మంత్రులే స్వయంగా ఈ కార్యక్రమాలకు హాజరై బడ్జెట్ ముఖ్యాంశాలను వివరించనున్నారని తెలిపారు. ఈ నెల 7న విజయవాడకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ రానున్నారని, ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో ప్రత్యేక సమావేశం జరుపుతారని మాధవ్ తెలిపారు. అలాగే వివిధ వర్గాల ప్రతినిధులతో బడ్జెట్‌పై చర్చలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో బడ్జెట్ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, కర్నూలు, తిరుపతి, నెల్లూరు నగరాల్లో జరిగే ఈ సదస్సులకు కేంద్ర మంత్రులు హాజరై బడ్జెట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. కేంద్ర మంత్రుల నేతృత్వంలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, బడ్జెట్‌లోని అవకాశాలు ప్రతి ఇంటికి చేరేలా చేస్తామని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఈ ఔట్‌రీచ్ కార్యక్రమాలు రాష్ట్రంలో అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలకంగా నిలవనున్నాయని బీజేపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు ఏపిజేఏసి అమరావతి నాల్గవ రాష్ట్ర మహాసభ

○ **విజయవాడలో ఘన నిర్వహణ... వేలాదిగా తరలిరావాలని పిలుపు**




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):**96 ఉద్యోగ సంఘాల కలయికతో ఏర్పడిన ఏపిజేఏసి అమరావతి నాల్గవ రాష్ట్ర మహాసభలు నేడు (ఫిబ్రవరి 5) విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్నాయి. రాష్ట్రంలోని అన్ని శాఖల ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని జేఏసి నాయకులు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఫిబ్రవరి 4, 5 తేదీల స్పెషల్ క్యాజువల్ లీవును వినియోగించుకోవాలని తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు విజయవాడ లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డుమీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించి మహాసభలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇదే రోజున 21 మందితో కూడిన నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నట్లు చెప్పారు.
విజయవాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ-2017 ఫిబ్రవరి 5న తిరుపతిలో 17 శాఖల సంఘాలతో ఆవిర్భవించిన ఏపిజేఏసి అమరావతి నేడు 96 శాఖల సంఘాలతో రాష్ట్రంలో అతిపెద్ద జేఏసిగా ఎదిగిందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది హక్కులు సాధించడమే లక్ష్యంగా ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.
**మంత్రుల హాజరు:** ఈ మహాసభకు మంత్రివర్గ సభ్యులు పయ్యావుల కేశవ, నాదెండ్ల మనోహర్, సత్యప్రసాద్ యాదవ్ హాజరవుతారని నాయకులు తెలిపారు.
ఉద్యోగుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.
**ప్రధాన డిమాండ్లు :** ఉద్యోగులు ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, బకాయిలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని పలిశెట్టి దామోదరరావు కోరారు.
**మహిళల భాగస్వామ్యం:** ఉద్యోగుల్లో 60 శాతం మహిళలే ఉన్న నేపథ్యంలో పింక్ డ్రెస్ కోడ్‌తో భారీగా హాజరై ఐక్యత చాటాలని ఉమెన్ కమిటీ నేతలు పిలుపునిచ్చారు.

## ఉద్యోగుల బకాయిలపై వినతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌ను కలసి ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో వీటిపై చర్చించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. 1-7-2023 నుంచి అమలులోకి రావాల్సిన 12వ వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ను ఏర్పాటు చేయాలని, ఈలోగా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బకాయిలపై స్పష్టమైన షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఉద్యోగులపై కొనసాగుతున్న డిసిప్లినరీ ప్రోసీడింగ్స్‌ను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే రెండు సరెండర్ లీవు బిల్లులు చెల్లించాలని అసోసియేషన్ కోరింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు, ప్రధాన కార్యదర్శి చాంద్ బాష, సంయుక్త కార్యదర్శి జి. శ్రీనివాసరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుమిత్రా దేవి, దుర్గాదేవి, గుంటూరు జిల్లా నాయకులు బి. కోటేశ్వరరావు, డి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## 5న సాగునీటి సంఘాల అధ్యక్షుల సదస్సు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని అన్ని సాగునీటి సంఘాల అధ్యక్షులతో ఈ నెల 5వ తేదీన సదస్సును నిర్వహిస్తున్నారు. "మన నీరు-మన భవిష్యత్తు" సాగునీటి సంఘాల పాత్ర శీర్షికన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సదస్సు నేలపాడు (అమరావతి)లో హైకోర్టు దగ్గర పెరేడ్ గ్రౌండ్స్ లో 5వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల నుండి జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 12 వేల సాగునీటి సంఘాల అధ్యక్షులు హాజరు కానున్నారు. ఈ సదస్సు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ బి.రాంబాబులతో కలిసి జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామా నాయుడు బుధవారం పరిశీలించారు. భోజన వసతి ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుండి జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్ లలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని మంత్రి డా.నిమ్మల రామా నాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఏఎస్పీ ఏ.టి.వి రవి కుమార్, డిఎస్పీ టి.మురళీ కృష్ణ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# బూతు నేత ఇంటికి జగన్

○ **అంబటి సంస్కారవంతమైన వ్యక్తి అంటూ కుసంస్కారి జగన్ కితాబు**

○ **తిరుమల లడ్డూ విషయాన్ని సైడ్ ట్రాక్ పట్టించడానికే పరామర్శ డ్రామా**

○ **ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ**




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి పరామర్శకు రావాలంటే బెట్టింగ్ కింగ్ అయినా అయి ఉండాలి... లేదంటే గంజాయి స్మగ్లర్ అయినా అయి ఉండాలి... లేదా జనం ఛీ కొట్టే బూతు చరిత్ర ఉన్నవాడై ఉండాలి. అలాంటి బూతు చరిత్ర ఉన్న అంబటి రాంబాబుకు సంస్కారవంతుడని కుసంస్కారి అయిన జగన్ సర్టిఫికేట్ ఇవ్వడం అతనిలోని జంగిల్ రాజ్ మనస్తత్వాన్ని మరోసారి బయటపెట్టుకున్నట్లు అయిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వాళ్లను మందలించాల్సిందిపోయి... శెభాష్‌అంటూ వారికి కితాబు ఇస్తూ పరామర్శ పేరుతో అలజడులు సృష్టించడం జగన్‌రెడ్డికి పరిపాటిగా మారిపోయిందన్న మన్నవ మోహనకృష్ణ... రాజకీయ ప్రత్యర్థులను హతమార్చడం, అడ్డొచ్చిన వారిని భౌతికంగా తొలగించే సంస్కృతికి రాష్ట్రంలో తొలిసారిగా బీజం వేసింది వైఎస్ కుటుంబమేనని మండిపడ్డారు. నాడు రాజారెడ్డి, మొన్న రాజశేఖర్‌రెడ్డి, నేడు జగన్‌రెడ్డి వరకు అదే విధమైన అరాచక పాలన కొనసాగుతోందని ఆయన గుర్తుచేశారు. ఈరోజు రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నది వైసీపీ నేతలేనని అన్నారు. పదేపదే అరాచకాలు చేసి కూడా తాము శాంతికాముకులమని, ప్రజాస్వామ్యవాదులమని జగన్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీఎం చంద్రబాబును తీవ్ర పదజాలంతో దూషించి అరెస్టైన వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు బుధవారం గుంటూరుకు వచ్చిన జగన్... మరోసారి తన మార్క్ అబద్ధాలను వండి వార్చరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులిచ్చి జనాన్ని పోగేసి నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఉరుకునేది లేదన్నారు. తన ఉనికి కోసం కులాల మధ్య చిచ్చు పెట్టడం, ఆయా సామాజిక వర్గాలను రెచ్చగొట్టడం జగన్ కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఈ మేరకు బుధవారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మన్నవ మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... రాజారెడ్డి వారస్వత రాజ్యాంగం పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తల పొలాలను నాశనం చేసి, పంటలు తగలబెట్టి, ఇళ్లు కూల్చి, దాడులు చేసిన చరిత్ర వైసీపీదేనని గుర్తుచేశారు. వైసీపీ నేతలే బూతులు తిడతారని, దాడులు చేయిస్తారని, మళ్లీ వారే రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందంటూ భయాందోళనలు సృష్టిస్తున్నారని అన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసింది ఎవరు? ప్రశ్నించిన పట్టాభిపై దాడులు జరగలేదా? అంగళ్లులో చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్లినప్పుడు అకారణంగా దాడి చేయించింది మీరు కాదా జగన్ రెడ్డి అని నిలదీశారు. జెడ్ ప్లస్ భద్రత ఉన్న చంద్రబాబునాయుడుపై కూడా దాడికి పాల్పడిన విషయం ప్రజలు మర్చిపోలేదని, నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో అడుగడుగునా వేధింపులకు గురి చేసిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేదన్నారు. రాజకీయాల్లో కుటుంబాలను, కులాలను లాగకూడదని, సిద్ధాంతపరమైన వైరం మాత్రమే ఉండాలని, మహిళలను దూషించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467